ఆంధ్రజ్యోతి ***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 23 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106


సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 । కనిష్ఠం 20.2



వేసవికి ముందే విద్యుత్ కటకట

- బోరుబావుల సాగు పెరగడంతో విద్యుత్‌కు డిమాండ్
- నల్లగొండ జిల్లాలో యాసంగిలో బోరుబావుల సాగే
- అదనంగా పండ్ల తోటలకూ బోర్ల ఆధారమే
- గతేడాది కంటే రోజుకు 1.43 మిలియన్ల యూనిట్ల అదనపు డిమాండ్
- మార్చినాటికి రోజుకు 25 మిలియన్‌యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా
- వ్యవసాయ ఫీడర్లకు రోజుకు 3 నుంచి 5.30 గంటలు విద్యుత్ కోతలు

నల్లగొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ జిల్లాలో వేసవి ఆరంభానికి ముందే విద్యుత్ కొరత ఏర్పడుతోంది. ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టులో సైతం క్రాప్‌హాలిడే ప్రకటించడంతో బోరుబావుల ఆధారంగానే సాగు చేపట్టారు. ఎండలు పెరగడం, వరి పైర్లు పొట్టదశలో ఉండడంతో నీటివినియోగం ఎక్కువవడంతో విద్యుత్ వాడకం పెరిగింది. జిల్లాలో సగటున రోజుకు 20మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమవుతుండడంతో అనధికారికంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. మార్చి నెలాఖరు వరకు పైర్లకు నీరు అవసరం ఉంటుందని, ఎండలు పెరుగుతుండడం, భూగర్భజలాలు అడుగంటిన నేపథ్యంలో విద్యుత్ వినియోగం మార్చినాటికి 25 మిలియన్‌యూనిట్ల విద్యుత్ సరఫరా డిమాండ్ ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు అంచనా వేస్తున్నారు.

యాసంగి సాగంతా బోరుబావులపైనే..

నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ ప్రాజెక్టుల కింద ఈ ఏడాది క్రాప్‌హాలిడే ప్రకటించడంతో యాసంగిలో ఆయకట్టు, నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో బోరుబావుల ఆధారంగానే పంటలు సాగయ్యాయి. యాసంగిలో సాధారణ సాగు 5.95లక్షల ఎకరాలకు కేవలం 2.35లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. ఇందులో వరి సుమారు లక్ష ఎకరాల్లో సాగయితే, 50వేల ఎకరాల్లో వేరుశనగ, మిగిలిన విస్తీర్ణంమేరకు జొన్న, బొబ్బర్లు, మినుములు తదితర ఆరుతడి పంటలు సాగయ్యాయి. వీటితో పాటు బత్తాయి, నిమ్మ, మామిడి తదితర పంట్ల తోటలు మరో 65వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఈ ఉద్యానపంటలకు పూర్తిగా బోరుబావుల నీరే ఆధారం కావడం, మరోవైపు అనూహ్యంగా ఇతర పంటలకూ ఈసారి బోరుబావులే ఆధారమవడంతో విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. జిల్లాలో మొత్తం 7,66,107 విద్యుత్ కనెక్షన్లుంటే, అందులో 2,17,660 వ్యవసాయ కనెక్షన్లు, 4,65,530 గృహవిద్యుత్ కనెక్షన్లు, 63,977 వాణిజ్యక నెక్షన్లు, 6,485 పరిశ్రమల కనెక్షన్లు, 8372 విద్యుద్దీపాల కనెక్షన్లు, 2710 వాటర్‌వర్క్స్ కనెక్షన్లు, 1373 ఇతర కనెక్షన్లున్నాయి. ఈ రెండు నెలల్లో మరో 10వేల వరకు అదనపు వ్యవసాయకనెక్షన్లు ఏర్పాటయ్యాయని చెబుతున్నారు. ఎండలు పెరగడం, భూగర్భజలాల నీటిమట్టాలు పడిపోవడంతో బోరుబావులకు విద్యుత్ వాడకం ఎక్కువగా ఉంటోందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లాకు సగటున ప్రతిరోజూ 20 మిలియన్‌యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటోందని, గతేడాది ఇదే సమయంలో 18.50 మిలియన్‌యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉండేదని అధికారులు చెబుతున్నారు. గతేడాది ఫిబ్రవరి 20వ తేదీన జిల్లాకు 18.63 మిలియన్‌యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటే, ఈ ఏడాది అదేరోజున 20.06 మిలియన్‌యూనిట్ల డిమాండ్ నమోదైంది. గతేడాది ఫిబ్రవరి 19న 18.49 మిలియన్‌యూనిట్ల డిమాండ్ ఉంటే, ఈయేడాది 19.90 మిలియన్‌యూనిట్ల డిమాండ్ ఉంది. ఈ నెల 18న జిల్లాలో 19.64 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. సగటున ప్రతిరోజూ విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని, మార్చివరకు డిమాండ్ పెరుగుతూ పోతుందని, సగటున మార్చి మొదటివారం నాటికి 25మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందనే అంచనాలతో సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నామని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

డిమాండ్ పెరగడంతో అనధికారిక కోతలు

జిల్లాలో అనూహ్యంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో గృహవినియోగానికి, పరిశ్రమలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తున్నప్పటికీ, వ్యవసాయ ఫీడర్లకు మాత్రం అనధికారిక కోతలు విధిస్తున్నారు. డిమాండ్ పెరగడానికి తోడు, సరఫరా నియంత్రణలో క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది, అధికారుల నడుమ సమన్వయం లోపించడంతో జిల్లాలో వ్యవసాయ ఫీడర్లకు విద్యుత్ కోతలు తప్పడం లేదు. ఇటీవల నిడమనూరు, త్రిపురారం మండలాల్లో అనధికారిక కోతలు అధికమవడంతో రైతాంగం ధర్నాలు చేసిన అంశంపై డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వాస్తవపరిస్థితిపై విచారణకు ఆదేశించడంతో విచారణ బృందం క్షేత్రస్థాయి సమన్వయ లోపాన్ని తేల్చింది. ఇందుకు బాధ్యులుగా నల్లగొండ ఎస్ఈ చంద్రమోహన్, మిర్యాలగూడ డీఈ వెంకటేశ్వర్లుకు చార్జిమెమోలు కూడా జారీ అయిన విషయం తెలిసిందే. ఎంత డిమాండ్ పెరిగినా సరఫరాలో నాణ్యత లోపించకుండా రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామనే సందేశాన్ని ఈఘటనతో ప్రభుత్వం రైతాంగానికి అందించే ప్రయత్నం చేసినా పీక్‌అవర్ లోడ్ రిలీఫ్ పేరుతో నల్లగొండ డివిజన్‌లో సాయంత్రం 5.30 నుంచి 8.30వరకు కోతలు విధిస్తుంటే, విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటోన్న మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 11వరకు కోతలు కొనసాగుతున్న పరిస్థితి క్షేత్రస్థాయిలో నెలకొంది. అనవసర కోతలు లేకుండా, కేవలం పీక్ అవర్ లోడ్ రిలీఫ్ కోతలుంటే రైతాంగం నుంచి కూడా అంతగా వ్యతిరేకత రాదనే అభిప్రాయం ఉన్నతాధికారుల్లో వ్యక్తమవుతోంది. సగటున జిల్లాలో మూడు గంటల నుంచి అయిదున్నర గంటలవరకు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఒకవైపు ఎండలు పెరగడం, మరోవైపున బోర్లలో నీరు తగ్గడంతో తడులు తిరగడానికి ఎక్కువ సమయం పడుతోందని, దీంతో పంటల్లో కొంతమేర ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో సైతం ఇప్పుడిప్పుడే విద్యుత్ కోతలు విధిస్తున్నారని అక్కడి రైతులు చెబుతున్నారు.

జిల్లాలో 8 గంటలు కోత

ఆంధ్రజ్యోతి, యాదాద్రి: జిల్లాలో మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరాలో సుమారు 8గంటల కోత విధిస్తున్నట్టుగా రైతులు చెబుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 5.30గంటలకు మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరా చేస్తున్నారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 11.30గంటల మధ్య నిలిపివేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు మధ్యమధ్యలో ఎల్‌సీలు తీసుకోవడంతో ఈ కోతలు పెరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయానికి మూడు ఫేజ్‌ల విద్యుత్ 16గంటల పాటు సరఫరా అవుతోంది. సింగిల్ ఫేజ్ విద్యుత్‌లో సైతం కోతలు విధిస్తున్నారు. ఎల్‌సీల పేరుతో నిత్యం నాలుగైదు గంటల పాటు సరఫరా నిలిచిపోతుంది. పట్టణాల్లో సింగిల్‌ఫేజ్ సరఫరా గంటన్నర పాటు అంతరాయం ఏర్పడగా, గ్రామీణ ప్రాంతాల్లో మూడు ఫేజ్‌లతో కనెక్షన్ ముడిపడి ఉండటంతో ఎక్కువ సమయం కోతలు ఉంటున్నాయి. మరో వారం రోజుల్లో వరి పొట్ట దశలోకి రానుంది. ఈ నేపథ్యంలో నీరు సమృద్ధిగా అవసరం. ఈ పరిస్థితుల్లో విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

అప్పులుచేసి బోర్లు వేసినా ప్రయోజనం లేదు



నాకున్న ఐదు ఎకరాల్లో మూడెకరాలు వరి, రెండు ఎకరాల్లో నిమ్మతోట సాగుచేస్తున్నాను. జనవరి దాకా మూడు బోర్లుంటే నీరు పుష్కలంగానే ఉంది. ఇప్పుడు మూడు బోర్లు ఎండిపోయాయి. దీంతో పంట కాపాడుకునేందుకు అప్పులు చేసి మరీ మరో మూడు బోర్లు వేసినా వచ్చే కొద్దినీరు పంటలకు సరిపోవడం లేదు. దీనికితోడు రాత్రివేళ నాలుగ్గంటలవరకు కోత ఉంటోంది. దీంతో పంట తడి తిరగడంలేదు. నీరు సరిపోక వరిపొలం ఎండుతోంది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

కంచరకుంట్ల చిన్నభిక్షం రెడ్డి, రైతు, దర్వేశిపురం

పదిగంటలు కూడా రావడం లేదు



నేను ఎనిమిది ఎకరాలలో వరిసాగు చేశాను. ఎండలు ముదరడంతో ఇప్పుడు నీటి అవసరం పెరిగింది. త్రీఫేజ్ కరెంటు రోజుకు 10గంటలకు మించిరావడం లేదు. దీంతో పంట ఎండిపోతోంది. ప్రభుత్వం వ్యవసాయ ఫీడర్లకిచ్చే విద్యుత్‌ని ఆటంకాల్లేకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. పంటలు చేతికందేవరకు విద్యుత్ సరఫరా లోపాల్లేకుండా చూడాలి.

మచ్చ సైదులు, ముప్పారం, నిడమనూరు మండలం

వ్యవసాయ ఫీడర్లకు కోతలు లేవు

వ్యవసాయ ఫీడర్లకు విద్యుత్ కోత విధించడం లేదు. ప్రభుత్వ ఆదేశాలమేరకు 24గంటలసరఫరా కొనసాగిస్తున్నాం. ఇటీవల విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఆమేరకు సరఫరాలో లోటు లేకుండా చూస్తున్నాం. ఎల్‌సీలు, సాంకేతిక సమస్యలు ఉన్నప్పుడు తప్ప ఇతర సమయాల్లో విద్యుత్ కోతలు లేవు.

వెంకటేశ్వర్లు, డీఈ, నల్లగొండ

'వైటీపీఎస్' పనులపై

రేపు ఉన్నతస్థాయి సమీక్ష



- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి రాక


నల్లగొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్)ను ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం సందర్శించనున్నారు. ఆయనతోపాటు భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నారు. శనివారం ఉదయం 11గంటలకు దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న వైటీపీఎస్ వద్దకు చేరుకున్న అనంతరం ప్లాంట్‌లో నిర్మాణంలో ఉన్న అన్ని విభాగాలను పరిశీలిస్తారు. అనంతరం అక్కడే కలెక్టర్‌తో పాటు, జెన్‌కో ఉన్నతాధికారులతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించనున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిసారి యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌ను మంత్రులు సందర్శిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పవర్ ప్లాంట్ పనులు మందగించాయని, కంకర, ఇసుక, ఇతర సామగ్రి సరఫరా నిలిచిపోవడం, బిల్లుల పెండింగ్ ఉండడం, కాంట్రాక్టర్లపై కీలకనేతలు ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో మంత్రుల పర్యటన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. థర్మల్ ప్లాంట్ పనులు నిలిచిన అంశంపై 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 'మాకేంటి..?' శీర్షికన ఈనెల 12న కథనం ప్రచురితమైంది. రాజకీయ ఒత్తిడి తెస్తున్న నేతలెవరనే అంశంపై అధికార, రాజకీయవర్గాల్లో విస్తృతస్థాయిలో చర్చ జరిగింది. ఈ కథనంపై స్పందించిన రాష్ట్ర విద్యుదుత్పత్తి కార్పొరేషన్ ఈనెల 20న ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం పనులు యథావిధిగా కొనసాగుతాయని ప్రకటించింది. తాజాగా, పర్యావరణ అంశాలపైనా ఈనెల 20న ప్రజాభిప్రాయ సేకరణ సైతం ఎలాంటి అవరోధాల్లేకుండా ముగిసింది. ఈ వరుస ఘటనల అనంతరం, శనివారం ఉపముఖ్యమంత్రి నేతృత్వంలో మంత్రులు పవర్‌ప్లాంట్‌ను సందర్శించి అక్కడే సమీక్ష నిర్వహించి పనుల పురోగతిపై సూచనలు ఇవ్వనున్నట్టు తెలిసింది. పనులు ఏ మేరకు పూర్తయ్యాయి? ఇంకా చేపట్టాల్సిన పనులు ఏంటి? అందుకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలేంటి? అనే అంశాలపై సమీక్ష అనంతరం జెన్‌కో అధికారులకు మంత్రులు మార్గనిర్దేశం చేయనున్నారు. సెప్టెంబరులోగా మొదటి దశలో పవర్ ప్లాంట్‌లోని రెండు యూనిట్ల నుంచి 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రారంభించేలా పనులు ముమ్మరం చేసేందుకు ఈ సమీక్ష తర్వాత కార్యాచరణ మొదలవుతుందని, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులపైనా స్పష్టత వస్తుందని జెన్‌కో అధికారులు భావిస్తున్నారు.

పర్యటన షెడ్యూల్ ఇలా..

డిప్యూటీ సీఎం, మంత్రులు శుక్రవారమే రావాల్సి ఉండగా, హెలీకాప్టర్ అందుబాటులో లేకపోవడంతో షెడ్యూల్‌ను శనివారానికి మార్చారు. హైదరాబాద్ బేగంపేటలోని ఉపముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం ఉదయం 8గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరుతారు. 10.30కు దామరచర్లకు చేరుకొని అక్కడ అధికారులు, రాజకీయ ప్రజాప్రతినిధులు, ఇతర నేతలతో సమావేశమవుతారు. అనంతరం 10.45కు యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌కు చేరుకుంటారు. 10.45 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అక్కడే ఉంటారు. తొలుత ప్లాంట్ ఆసాంతం కలియదిరిగి, పనుల నిర్వహణను తనిఖీ చేస్తారు. అనంతరం కలెక్టర్ సహా జెన్‌కో అధికారులతో ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహిస్తారు. 1.45కు అక్కడి నుంచి బయలుదేరి తిరిగి సాయంత్రం 4గంటలకు సచివాలయానికి చేరుకుంటారు.

విద్యుత్ సరఫరాపై ఆరా తీసే అవకాశం



నల్లగొండ జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో బోరుబావుల వినియోగం పెరగడంతో విద్యుత్ సరఫరా డిమాండ్ పెరిగిన నేపథ్యంలో సరఫరా ఆటంకాలు లేకుండా చూసేందుకు పర్యటన సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆరా తీసే అవకాశం ఉంది. ఇటీవల నిడమనూరు, త్రిపురారం మండలాల్లో ఉద్యోగులు, అధికారుల నడుమ సమన్వయం లేక విద్యుత్ సరఫరాలో అడ్డగోలు కోతలు విధించడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ధర్నా చేశారు. ఈ అంశంపై తీవ్రంగా స్పందించిన డిప్యూటీ సీఎం విచారణకు ఆదేశించడం, విచారణలో అధికారుల సమన్వయ లోపమే ప్రధాన కారణమని పేర్కొనడంతో నల్లగొండ ఎస్ఈ, మిర్యాలగూడ డీఈకి చార్జిమెమోలు జారీచేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో యాసంగి పంటలు చేతికి వచ్చే వరకు విద్యుత్ కోతల్లేకుండా నాణ్యమైన సరఫరా చేసే అంశంపై డిప్యూటీ సీఎం ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశాలు జారీచేస్తారని భావిస్తున్నారు.

మాన్యంచెల్క పీహెచ్‌సీకి లైన్‌క్లియర్

- స్థలం కేటాయింపునకు జైళ్లశాఖ అంగీకారం
- మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా



మంత్రితో మాట్లాడుతున్న డీజీ సౌమ్యమిశ్రా


నల్లగొండ, ఫిబ్రవరి 22 : నల్లగొండ పట్టణం మాన్యంచెల్కలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి మార్గం సుగమమైంది. పీహెచ్‌సీ కోసం జైళ్లశాఖకు చెందిన స్థలాన్ని ఇవ్వాలన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఆ శాఖ అంగీకారం తెలిపింది. ఈ మేరకు గురువారం మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఆ శాఖ ఉన్నతాధికారి సౌమ్యమిశ్రా స్థల కేటాయింపుపై చర్చించారు. త్వరలోనే కలెక్టర్‌తో సమావేశమై సంబంధిత స్థలాన్ని ప్రభుత్వానికి అందజేస్తామని మంత్రికి ఆమె తెలిపారు.

డీజిల్ అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

నల్లగొండ, ఫిబ్రవరి 22 : జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌లను నడిపిస్తున్నట్లు చూపించి డీజిల్ పేరిట ప్రభుత్వ సొమ్మును కాజేసిన విషయంపై జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉన్నతాధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. లక్షల రూపాయల నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణల నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నిత్యానందం ఆధ్వర్యంలో అధికారులు బృందం విచారణ నిర్వహిస్తోంది. అంబులెన్స్‌లకు సంబంధించిన లాగ్ బుక్‌లను, బిల్లులను ఇతర రికార్డులు అన్నింటినీ స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. విచారణ పూర్తయిన వెంటనే నివేదికను కలెక్టర్‌తో పాటు డీఎంఈకి సమర్పిస్తామని సూపరింటెండెంట్ నిత్యానందం తెలిపారు. అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేములపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- నూతన చైర్మన్‌గా రాములుయాదవ్



నూతన చైర్మన్ రాములుయాదవ్

వేములపల్లి, ఫిబ్రవరి 22 : వేములపల్లి ప్రాథమిక సహకార సంఘం సొసైటీ చైర్మన్‌పై గురువారం ప్రవేశపెట్టిన అవిశ్వాసం తీర్మానం నెగ్గింది. సొసైటీలో 13 మంది డైరెక్టర్లుండగా ఒకరు చనిపోవడంతో 12 మంది ఉన్నారు. డీసీవో కిరణ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి 12 మంది హాజరు కాగా 11 మంది అనుకూలంగా ఓటు వేయడంతో అవిశ్వాసం నెగ్గింది. మధ్యాహ్నం అనంతరం నూతన చైర్మన్ ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించారు. వేములపల్లి డైరెక్టర్ జడ రాములుయాదవ్‌ను మాజీ చైర్మన్ జెర్రిపోతుల రాములుగౌడ్ ప్రతిపాదించగా మరో సభ్యురాలు పద్మ ఆమోదించారు. ఇతరులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో రాములుయాదవ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. కార్యక్రమంలో డీసీవో సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ స్వామి, జూనియర్ అసిస్టెంట్ సుభాన్, సీఈవో రవీందర్‌రావు, డైరెక్టర్లు మాలి శంకర్‌రెడ్డి, శ్రీలత, సాంబయ్య, లక్ ప్రకాశ్, పాపయ్య, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లచ్చిరెడ్డి, బాలోజీ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్

నల్లగొండ, ఫిబ్రవరి 22 : ఇంటర్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిచర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థుల కోసం జిల్లాలో 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 32,895మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పదో తరగతి పరీక్షకు సంబంధించి 473 కేంద్రాలను ఏర్పాటుచేశామని ఆయా కేంద్రాల్లో 19,715మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అధికారులు బాధ్యతతో పరీక్షలను నిర్వహించాలన్నారు. అన్నిమార్గాల్లో ఆర్టీసీ బస్సులను నడపాలని, అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలను మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దస్రునాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ యూసుఫ్‌షరీఫ్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అమలుచేయాలి

నల్లగొండ: పార్లమెంటు ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలుచేయాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో గురువారం ఎన్నికల ప్రవర్తననియమావళిపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం సూచించిన యాప్‌లు, ఆన్‌లైన్ విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవోలు రవి, చెన్నయ్య, దామోదర్, నోడల్ అధికారి, జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

12వ బెటాలియన్‌లో నూతన కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం

నల్లగొండ, ఫిబ్రవరి 22 : అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌లో గురువారం ఇటీవల కొత్తగా ఎంపికైన కానిస్టేబుళ్లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొమ్మిది నెలల పాటు పోలీస్ శిక్షణ ఇవ్వనున్నారు. హైదరాబాద్ ఏఆర్‌కు చెందిన 300మంది పురుష అభ్యర్థులను శిక్షణా కేంద్రానికి కేటాయించగా ఇందులో 236 మంది రిపోర్టు చేశారు. కార్యక్రమంలో 12వ బెటాలియన్ కమాండెంట్ సత్య శ్రీనివాసరావు, సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే, అసిస్టెంట్ కమాండెంట్‌లో చంద్రశేఖర్‌రావు, ఏ.తిరుపతి, ఎం.ఉదయభాస్కర్‌రావు పాల్గొన్నారు.

- వైభవంగా పాతగుట్ట నృసింహుడి కల్యాణం



పాతగుట్ట లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామివారి కల్యాణంలో తాళిబొట్టును చూపిస్తున్న అర్చకులు

•7లో..

వృద్ధుడు అదృశ్యం

వలిగొండ: ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన వల్లబు రామలింగయ్య (60) ఫిబ్రవరి 19వ తేదీన ఇంట్లో భార్యాభర్తల మధ్య వివాదం జరిగింది. భార్య లింగమ్మ మేకలను మేత కోసం గ్రామ చివరకు తోలుకెళ్లింది. వెళ్లింది. అనంతరం రామలింగయ్య ఇంటి నుంచి కనబడకుండా వెళ్లిపోయాడు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.



- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

శిగాలూగుతున్న వనం





చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు

ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం వేముల రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికి పైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకలగుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.

కానిస్టేబుల్ భార్య బలవన్మరణం

- *కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కలహాలు*



శ్రీవాణి మృతదేహం

దేవరకొండ, ఫిబ్రవరి 22: కుటుంబ కలహాలతో కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య చేసుకుంది. గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం మొండికానిగూడేనికి చెందిన కానిస్టేబుల్ రఘుమారెడ్డికి గుడిపల్లి మండలం రోళ్లకల్లుకు చెందిన శ్రీవాణి(26)తో 2019 ఫిబ్రవరిలో వివాహమైంది. రఘుమారెడ్డి నేరేడుగొమ్ము పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తుండగా, దేవరకొండ పోలీస్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కలహాలు కొనసాగుతున్నాయి. స్థలం కొనే విషయమై ఈ నెల 20వ తేదీన వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం రఘుమారెడ్డి డ్యూటీకి వెళ్లగా, శ్రీవాణి వెంట్రుకలకు వేసుకునే రంగు తాగింది. మధ్యాహ్న సమయంలో రఘుమారెడ్డి గమనించి శ్రీవాణి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. శ్రీవాణిని చికిత్స నిమిత్తం దేవరకొండ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. భార్యాభర్తల మధ్యల గొడవలే ఆమె మృతికి కారణమని శ్రీవాణి తండ్రి అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

నార్నే ఎస్టేట్ అధీనంలోని సీలింగ్ భూముల స్వాధీనం

- *యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఘటన*



నార్నే ఎస్టేట్ అధీనంలో ఉన్న సీలింగ్ భూములను స్వాధీనం చేసుకుంటున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

బీబీనగర్, ఫిబ్రవరి 22: యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పడమటి సోమారం రెవెన్యూ పరిధిలో ప్రముఖ నార్నే ఎస్టేట్ (ఈస్ట్ సిటీ) అధీనంలో ఉన్న సర్వే నెంబర్ 254 లోని 4.10 ఎకరాల సీలింగ్ భూమిని అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) భాస్కర్‌రావు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడమటి సోమారం గ్రామంలోని సర్వే నెంబర్ 254 లో 4.10 ఎకరాల భూమిని ఇదే గ్రామానికి చెందిన పేద రైతులు యాగ దేవయ్య, వ్యాగరి లింగయ్యలకు ప్రభుత్వం పంపిణీ చేసిందని తెలిపారు. ఈ సీలింగ్ భూములు నార్నే ఎస్టేట్ సంస్థ అధీనంలో ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందని, దాంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అసైన్డ్ సీలింగ్ భూములను పరిశీలిస్తున్నామని, రైతుల చేతుల్లో కాకుండా ఇతరుల అధీనంలో ఉంటే స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో అమరేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

- *15 రోజుల వ్యవధిలో రెండు ఘటనలు*



కుక్కల దాడిలో మృతి చెందిన జింక

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 22: అడవిలో ఉండాల్సిన వన్యప్రాణులు వేసవి తాపాన్ని తట్టుకోవడానికి జనావాసాల మధ్యకు వచ్చి కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయి. నల్లగొండ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో నాగార్జునసాగర్ డివిజన్ అటవీశాఖ పరిధిలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నాగార్జునసాగర్ డివిజన్ అటవీ శాఖ పరిధిలో నెల్లికల్ బీట్ సమ్మక్క - సారక్క దేవాలయం వద్ద నూతనంగా నిర్మించిన అర్బన్ పార్కును గత నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించారు. ఇందులో వన్యప్రాణులు తక్కువగా ఉండటంతో హైదరాబాద్ జూ పార్కు నుంచి పర్యాటకుల ఆహ్లాదం కోసం 18 జింకలను తీసుకువచ్చి ఇక్కడ వదిలారు. ఇందులో ఒక జింక ఈ నెల 8వ తేదీ గురువారం అర్బన్ పార్కు నుంచి తప్పించుకొని బయటకువెళ్లి తిరుమలయ్య గట్టు సమీపంలో కుక్కల దాడిలో చనిపోయింది. బుధవారం తెల్లవారుజామున మరో జింక తిరుమలయ్య గట్టు సమీపంలో రోడ్డుపైకి వచ్చింది. రహదారిపైకి వచ్చిన జింకను వీధి కుక్కలు వెంటాడి కరవటంతో మృతిచెందింది. గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మృతి చెందిన జింకను ఖననం చేసినట్లు ఎఫ్‌డీవో సర్వేశ్వర్ తెలిపారు. వన్యప్రాణులు దారి తప్పి జనావాసాల్లోకి వస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎఫ్‌డీవో కోరారు.

అడవిలో సౌకర్యాలు లేకపోవడం వల్లే....

150 ఎకరాల్లో నాగార్జునసాగర్ వద్ద ఉన్న అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో వన్యప్రాణులు వేసవి తాపాన్ని తట్టుకునేందుకు నీడనిచ్చే చెట్లు కాని, వాటి దాహార్తిని తీర్చేందుకు ఏర్పాట్లు లేకపోవడంతోనే వన్యప్రాణులు మృతిచెందుతున్నాయని ప్రకృతి ప్రేమికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అడవిలో ఏర్పాటు చేసిన సాసర్(తక్కువ లోతు, ఎత్తులో ఉండే నీటి తొట్లు) నీటిని నింపక పోవడం వల్లే వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చి కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయని పలువురు ప్రకృతి, జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జింకలను సాగర్‌కు తీసుకొచ్చే వరకు జూ పార్కులో నిర్వాహకులు వాటికి మేత, నీరు ఏర్పాటు చేస్తారు. సాగర్ అటవీ ప్రాంతంలో అలాంటి సౌకర్యాలు లేకపోవడం వల్లే జనావాసాల్లోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 22: దేవరకొండ నుంచి కొండమల్లేపల్లికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మండలకేంద్రంలో గురువారం కొండమల్లేపల్లి పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రెండు పార్లమెంట్ సీట్లను గెలిపించాలి

- **ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి**



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

చౌటుప్పల్‌టౌన్, ఫిబ్రవరి 22: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ సీట్లను గెలిపించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్పయాత్ర యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణానికి గురువారం సాయంత్రం చేరుకుంది. ఈ యాత్రలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు 50రోజులు నిజాయితీగా కష్టపడి పని చేస్తే ప్రజలు మద్దతుగా నిలుస్తారని అన్నారు. కార్యకర్తలు లేని లీడర్ లేరని, లీడర్ లేకున్నా కార్యకర్తలు ఉంటారని అన్నారు. ఈసారి పాతబస్తీలో కూడా బీజేపీ గెలుపు తథ్యమని, రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నరేంద్రమోదీ పాలనపై ప్రజల్లో విశ్వాసం, నమ్మకం రోజురోజుకూ పెరుగుతుందని, మూడోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌పై నెలకొన్న వ్యతిరేకత కాంగ్రెస్‌కు లబ్ధి కలిగిందన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ నిధుల కోసం వారానికొకసారి రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీ వద్దకు వెళ్లి బతిమిలాడుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంతో పాటు దేశం బాగుండాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ యాత్రలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, నల్లగొండ, యాదాద్రి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి, పాశం భాస్కర్, నాయకులు దూడల బిక్షం గౌడ్, దోనూరి వీరారెడ్డి, రమనగోని శంకర్, ఆలె చిరంజీవి, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి. సురేందర్‌రెడ్డి, పక్కీర్ శ్రీనివాస్‌రెడ్డి, జక్కలి శ్రీశైలం పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.



నకిరేకల్‌లో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

రద్దయిన నోటు బీఆర్ఎస్

చిట్యాల: బీఆర్ఎస్ పార్టీ రద్దయిన నోటు లాంటిదని, దానికి విలువలేదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన విజయ సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓ సిద్ధాంతం, ధర్మం లేవన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే అరాచకాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ సర్వేలోనే తెలంగాణలో బీజేపీకి 59శాతం ప్రజలు సానుకూలంగా ఉన్నారని, హైదరాబాద్ సహా 17స్థానాలలో పార్టీ విజయం సాధిస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, కోమటిరెడ్డి బ్రదర్స్ కబ్జా బ్రదర్స్‌గా మారారని ఆరోపించారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలన్నారు. కార్యక్రమంలో కృష్ణాయాదవ్, మైల నర్సింహ, కూరెల్ల శ్రీను, పొట్టపల్లి నర్సింహ, గంజి గోవర్ధన్, చికిలంమెట్ల అశోక్, మాస శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంగడి స్థలాన్ని పంచాయతీ స్వాధీనం చేసుకోవాలి

నార్కట్‌పల్లి, నకిరేకల్: నార్కట్‌పల్లి అంగడి స్థలాన్ని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలకు లోబడి గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకోవాలని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర గురువారం నార్కట్‌పల్లికి చేరింది. యాత్ర బృందానికి మండల బీజేపీ ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి (ఎన్‌పీఎస్) బాధ్యులు ఆయన్ను కలిసి అంగడి స్థలం హక్కు వివాదంపై వినతిపత్రాన్ని అందజేశారు. అంగడి స్థలం విషయంలో కొనసాగుతున్న వివాదాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి ఈ వ్యవహారంలో అవసరమైతే బీజేపీ తరఫున న్యాయ సహకారం అందిస్తామన్నారు. గ్రామ కంఠం భూమిగా కోర్టు, స్థల చరిత్ర చెబుతున్నా ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోకుండా పంచాయతీ తాత్సారం చేయడం శోచనీయమన్నారు. పైగా స్థలం కోసం పోరాటం చేస్తున్న పౌరులపై మతం రంగు పులిమి, అక్రమ కేసులు బనాయించి బెదిరించడం తగదన్నారు. ఈ వివాదంపై కలెక్టర్, ఎస్పీలను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, కొర్వి శంకర్, నడింపల్లి శ్రవణ్ కుమార్, మునుకుంట్ల గణేశ్, పానుగుల్ల శివ, పాలకూరి రమేశ్, పార్థసారథి, నల్లగొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నకిరేకల్‌లో జరిగిన యాత్రలో నకిరేకంటి మొగిలయ్య, గోలి ప్రభాకర్, మండల వెంకన్న, పల్లా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

మునుగోడు: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలమైందని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్పయాత్ర మూడో రోజు గురువారం రాత్రి మునుగోడుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. హామీలను అమలు చేయటానికి డబ్బులు లేక శ్వేతపత్రాలను విడుదల చేస్తోందని ఎద్దేవా చేశారు. ఇలా కాలయాపన రాజకీయాలు చేస్తూనే ప్రజలను మభ్య పెడుతున్నారని తెలిపారు. దేశంలో సుభిక్షమైన, సుస్థిరమైన సంక్షేమ పాలనే తన ఏకైక లక్ష్యంతో ప్రధాని మోదీ కృతనిశ్చయంతో పనిచేస్తున్నాడని కొనియాడారు. ఎవరు ఎన్ని చెప్పినా కేంద్రంలో బీజేపీనే మళ్లీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అంతకుముందు స్థానికంలోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాతగుట్ట దివ్య సన్నిధిలో...

శాస్త్రోక్తంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

- **వైభవంగా హనుమంత వాహన సేవ**



కల్యాణానికి పట్టు వస్త్రాలు అందజేస్తున్న విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 22: పాతగుట్ట లక్ష్మీనరసింహుడి సన్నిధిలో బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం హనుమంత వాహన సేవ, గజవాహన సేవోత్సవాలు వైభవంగా కొనసాగాయి. వేకువజామున గర్భాలయంలోని స్వయంభువులను ఆరాధించిన ఆచార్యులు మండపంలో ఉత్సవమూర్తులను వేద మంత్ర పఠనాలతో స్నపన తిరుమంజనాలు నిర్వహించారు. ప్రధానాలయ యాగశాలలో అర్చకబృందం, రుత్వికులు చతుస్థానార్చనలు, హోమ పూజలు, వేద ఇతిహాస, మూలమంత్ర, మూర్తి మంత్ర పఠనాలు జరిపారు. కల్యాణమూర్తులు లక్ష్మీనృసింహుడిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా శ్రీరాముడిగా అలంకరించి క్షేత్రపాలకుడు హనుమంత వాహనంపై అధిష్ఠింపజేసి తిరువీధుల్లో ఊరేగించారు. ఈ విశేష పర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకబృందం నిర్వహించగా ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీనృసింహుడికి ఘనంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నిత్య పూజలు ఘనంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి, మహామండపంలో స్ఫటిక మూర్తులను శైవాగమ పద్ధతిలో కొలిచారు.



స్వామివారిని వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 22: రైల్వేకాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేక్వార్టర్స్‌లో గురువారం జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలను రూరల్ ఎస్ఐ సతీష్‌వర్మ తెలిపారు. కాలనీకి చెందిన రైల్వే ఉద్యోగి దీపక్‌కు చెందిన 50/1 నెంబర్‌గల ఇంట్లో నివాసముంటున్నాడు. గురువారం తన భార్య ఆరోగ్యం బాగలేకపోవడంతో పట్టణంలోని ఓ ఆస్పత్రిలో వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే వరకు వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాపై ఉన్న సూట్‌కేసులో దాచిన 16 గ్రాముల బంగారాన్ని దొంగిలించుకెళ్లారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. బాధితుడు దీపక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌వర్మ తెలిపారు.

ప్రమాదవశాత్తు కూలీ మృతి

వేములపల్లి, ఫిబ్రవరి 22: రైస్‌మిల్లులో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి పడి రోజువారి కూలీ మృతి చెందిన సంఘటన శెట్టిపాలెం గ్రామ శివారులోని సంతోష్ రైస్‌మిల్లులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లి గ్రామానికి చెందిన మిర్యాల రంగయ్య (60) రోజు శెట్టిపాలెం శివారులోని సంతోష్ మిల్లులో పనికి వెళ్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం మిల్లులో పనికి వెళ్లి దుమ్ము దులిపే క్రమంలో కాలుజారి మెట్ల పైనుంచి పడ్డాడు. ఈ సంఘటనలో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో మృతుడి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడు రంగయ్యకు భార్య, కుమారుడు ఉన్నారు.

బియ్యం ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు

- **ఆర్డీవో సూర్యనారాయణ**



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్డీవో

కోదాడరూరల్, ఫిబ్రవరి 22: సీఎంఆర్ కింద ధాన్యం తీసుకున్న మిల్లర్లు ఈ నెలాఖరు వరకు బియ్యం ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో సూర్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని కొమరబండలోని శ్రీ వేంకటేశ్వర రైస్ మిల్లు, తమ్మరలోని భువనేశ్వరి రైస్‌మిల్లులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ రెండు మిల్లుల్లో ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం లేకపోవడంతో ఆయన మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఈ నెలాఖరు వరకు ధాన్యం ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఎంఆర్ కింద ధాన్యం తీసుకున్న కొమరబండ వేంకటేశ్వర రైస్‌మిల్లు 87 వేల క్వింటాళ్లు, తమ్మరలోని భువనేశ్వరి రైస్‌మిల్లు 12,760 క్వింటాళ్ల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ రెండు మిల్లులకు ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో డీలర్లు రేషన్ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని ఆరోపణలు రావడంతో రేషన్ షాపుల్లో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కొమరబండ, కోదాడ, చిలుకూరు మండలాల్లో పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న పథకానికి అందిస్తున్న బియ్యాన్ని కూడా చిలుకూరు, కొమరబండ ప్రభుత్వ పాఠశాలల్లో పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే నాణ్యమైన బియ్యంతోనే భోజనం అందించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే రేషన్‌డీలర్లపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డీటీసీఏ వెంకట్‌రెడ్డితో పాటు సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.

సివిల్స్ రాదేమోనని....

ఒత్తిడికి గురై యువకుడి ఆత్మహత్య



అఖిల్‌కుమార్ మృతదేహం

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 22: సివిల్స్ రాదేమోనని మానసిక ఒత్తిడికి గురైన ఓ యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో నివాసం ఉంటున్న సిదా ఆనందు, అనంతలక్ష్మికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు అఖిల్‌కుమార్ (24) డిగ్రీ పూర్తయ్యాక రెండేళ్లుగా సివిల్స్‌కు సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలో మానసిక ఒత్తిడికిగురై సివిల్స్ రాదేమోనన్న భయంతో గురువారం ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, నిఖిల్ తండ్రి అనారోగ్యానికి గురి కాగా హైదరాబాద్ కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తల్లి అక్కడే ఉంది. తల్లిదండ్రులను ఇంటికి తీసుకువచ్చేందుకు అతడి అఖిల్‌కుమార్ అన్న సిదా నిఖిల్‌కుమార్ హైదరాబాద్ వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అఖిల్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న నిఖిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 21: జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో మడేలేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం రాజు అనే యువకుడిని యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదే మండలం ఆరూర్‌కు చెందిన రాజు బాలికపై అత్యాచారం చేసి తప్పించుకు తిరుగుతున్నాడని పోలీసులు తెలిపారు. ఆలయం వద్ద ఉత్సవాలు జరుగుతుండగా, పోలీసులు అదుపులోకి తీసుకోవటంతో అక్కడికి వచ్చిన భక్తులు ఆందోళన చెందారు.

విద్యాశాఖలో సీఆర్పీల పాత్ర కీలకం : డీఈవో



డైరీ ఆవిష్కరిస్తున్న డీఈవో భిక్షపతి

శాలిగౌరారం, ఫిబ్రవరి 22: విద్యాశాఖ అమలు చేసే ప్రతి కార్యక్రమాన్నీ క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు బాధ్యతతో కృషిచేస్తున్నారని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. సీఆర్పీల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని గురువారం ఆవిష్కరించారు. విద్యాశాఖ అమలు చేసే ప్రతి కార్యక్రమంలో సీఆర్పీల పాత్ర చాలా కీలకమన్నారు. బడిబాట పిల్లలను బడిలో చేర్పించడం, క్షేత్రస్థాయి పాఠశాలల్లో పర్యవేక్షణ, పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన అమలు, కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహణకు సహకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రామచంద్రనాయక్, సీఆర్పీఏటీఎస్ రాష్ట్ర కోశాధికారి కంచర్ల మహేందర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, చందపాక నాగరాజు, కోశాధికారి బొమ్మరగోని సైదులు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కునుకుంట్ల కొండయ్య, యర్రమల్ల నాగయ్య, సలహాదారులు సత్యనారాయణ, వెంకటకృష్ణ, ఉపాధ్యక్షులు వేముల నాగయ్య, శ్రీనివాస్‌స్వామి, గోవింద్ పాల్గొన్నారు.

సర్వీస్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

డిండి, ఫిబ్రవరి 22: ఎస్‌బీఐ కస్టమర్స్ సర్వీస్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏజీఎం సన్యాసిరాజు కోరారు. మండలంలోని రామాంతపూర్ గ్రామంలో ఎస్‌బీఐ కస్టమర్స్ సర్వీస్ పాయింట్‌ను గురువారం ప్రారంభించారు. 25కిలోమీటర్ల దూరంలో ఎస్‌బీఐశాఖ ఉండడంతో ప్రజలు ఎస్‌బీఐ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారని, ప్రజల సౌకర్యం కోసం రామాంతపూర్‌లో సర్వీస్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్‌వీటీ, ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి, టి. బుచ్చిరెడ్డి, ఆంజనేయులు, రాజ్‌కుమార్, పర్వతాలు, రాములు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచులు

మర్రిగూడ, ఫిబ్రవరి 22: పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచులను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు విడుదల చేయడంలో ఆలస్యమవుతున్నందున అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టినట్లు మర్రిగూడ మాజీ సర్పంచ్ నల్ల యాదయ్యగౌడ్ తెలిపారు. పోలీసులు మేము అసెంబ్లీని ముట్టడి చేయకుండా ముందస్తుగానే తమను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచాడాన్ని ఖండిస్తున్నామన్నారు. అరెస్టు అయిన వారిలో శివన్నగూడ మాజీ సర్పంచు చిట్యాల యాదగిరిరెడ్డి, రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని అవంతీపురం గ్రామపంచాయతీలో రూ.30లక్షల అవినీతికి పాల్పడిన ప్రజాప్రతినిధులు, గత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ అవంతీపురం గ్రామపంచాయతీ రికార్డులను జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఆడిట్ చేస్తున్న సమయంలో గ్రామపంచాయతీలో రూ.30లక్షల అవినీతి, అనేక అక్రమాలు జరిగాయని బయటపడినప్పటికీ ఇంతవరకు సదరు ప్రజాప్రతినిధులపై, గత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో అవంతీపురం గ్రామ కార్యదర్శిగా ఉన్న మదన్‌మోహన్ అవినీతికి పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా అతన్ని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. మదన్‌మోహన్ పంచాయతీ కార్యదర్శిగా ఉన్న కాలంలో గ్రామంలో భూములను అమ్ముకోవడం, అక్రమంగా పట్టాలు చేయించి అనేక అక్రమాలు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పోతుగంటి కాశి, వస్కుల సైదమ్మ, రామాంజి జ్యోతి, ధీరావత్ మోహన్‌నాయక్, వలమళ్ల ఆశీర్వాదం, గడ్డి వీరయ్య, తలకొప్పుల ప్రశాంత్, వస్కుల భరత్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



మెగా హెల్త్‌క్యాంప్‌ను ప్రారంభిస్తున్న మిల్లర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 22: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ అన్నారు. స్థానిక మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన మెగా హెల్త్‌క్యాంప్‌ను లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ కర్నాటి రమేష్‌తో కలిసి ప్రారంభించారు. పేదలకు అన్నదానం, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, విద్యాదానంతో పాటు రూరల్ ప్రాంతాలతోపాటు అర్బన్ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంటినెంటల్ ఆస్పత్రి మోకాలి రీప్లేస్‌మెంట్ స్పెషలిస్ట్ మల్లు అరుణ్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యశిబిరంలో 400మందికి మోకాళ్ల నొప్పులు, బీపి, షుగర్, చెవి, ముక్కు, గొంతు నొప్పుల పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మిల్లర్స్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటరమణ చౌదరి, లయన్స్‌క్లబ్ సెక్రటరీ యనగందుల లింగయ్య, కోశాధికారి ముత్యాల రామకృష్ణారావు, ముక్కపాటి వెంకటేశ్వరరావు, రంగా శ్రీధర్, వైద్య నిపుణులు జనరల్ ఫిజీషియన్ కె. జగదీశ్, ఈఎన్‌టీ నిపుణులు జి. దుష్యంత్, గుండె వైద్య నిపుణులు శ్రవణ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంతనే నీరున్నా..

● పెద్దదేవులపల్లిలో తాగునీటి కష్టాలు ● రిజర్వాయర్ ఉన్నా అందని నీరు ● నాణ్యతలేని ట్యాంకులు, పైప్‌లైన్లు అస్తవ్యస్తం



పెద్దదేవులపల్లిలోని రిజర్వాయర్, సంపు హౌస్,



త్రిపురారం, ఫిబ్రవరి 22: శిరస్సున గంగమ్మ ఉన్నా దాహం తీరడం లేదు. మిషన్ భగీరథ పథకం అద్భుతమని ప్రజలకు భవిష్యత్‌లో తాగునీటి కొరత తలెత్తకుండా చేపట్టిన బృహత్తర కార్యక్రమం చేపట్టామని ప్రగల్భాలు పలికిన పాలకులు ఆచరణలో విఫలమయ్యారు. త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లిలో రిజర్వాయర్ ఉంది. సాగర్ ఎడమ ప్రధాన కాల్వ ద్వారా ఈ రిజర్వాయర్‌కు నీటి సరఫరా అవుతుంది. త్రిపురారం మండలంలోని పలు గ్రామాలతో పాటు మిర్యాలగూడ పట్టణా నికి ఇక్కడ నుంచే తాగునీరు సరఫరా అవుతుంది. రిజర్వాయర్ సమీపంలో ఐదేళ్ల క్రితం మిషన్ భగీరథ పథకం నిర్మాణం చేపట్టారు. కాని రిజర్వాయర్ ఉన్న పెద్దదేవులపల్లి గ్రామంలో ఇప్పటి వరకు సరైన తాగునీటి సరఫరా జరగడం లేదు. మిషన్ భగీరథ పనుల్లో భాగంగా ఐదేళ్ల క్రితం గ్రామంలో 90,60,20 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. నిర్మాణ లోపాలు పైప్ లైన్‌లు సరిగా లేక ఆరు నెలల వరకు ట్యాంకులు వృథాగా ఉన్నాయి. ట్యాంకులు రెయిలింగ్, అడుగు భాగం సిమెంట్ ఊడిపోవడంతో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ట్యాంకు పైకి ఎక్కడానికి వీలు లేకుండా ఉంది. రెయిలింగ్ పూర్తిగా ఊడిపోయి ప్రమాదకరంగా మారిపోయింది. ప్రభుత్వ పాఠశాలలో ట్యాంకుదీ ఇదే దుస్థితిలో ఉన్న ప్రస్తుతం సిమెంట్ పూసి తాత్కలిక మరమ్మతులు చేపట్టారు. ఐదు వేల జనాభా ఉన్న గ్రామానికి ఇంటింటికీ నల్లా పైప్‌లైన్‌లు వేసిన కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. రాళ్లు వచ్చిన దగ్గర అవి తొలగించ కుండానే పై నుంచి వేయడంతో చాలా వరకు పైపులు ధ్వంసమయ్యాయి. సరైన ప్రణాళిక లేకుండానే పైపులు వేయడంతో నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని కొన్ని ప్రాంతాలకు కనీసం పైపులు వేయ కుండానే వదిలేశారు. సీసీ రహదారుల వేసిన దగ్గర పైపులైన్‌లు దెబ్బతి న్నాయి. ప్రస్తుతం ట్యాంకులు నింపినా అంతర్గత పైపు లైనులు సరిగా లేకపోవడంతో కేవలం ట్యాంకుల సమీపంలోని 40శాతం మేర సరఫరా జరుగు తుందని ఆ మట్టితో కూడిన నీరు వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఎంత ప్రయత్నం చేసిన సరైన పైపులైన్ల వ్యవస్థ లేకుండా పోవడంతో నీటి సరఫరా కష్టంగా మారింది. పూర్తిస్థాయిలో కొత్త పైపులు వేస్తే తప్ప తాగునీటి సరఫరా జరగడం సాధ్యం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నిసార్లు విన్నవించుకున్నా..

తాగునీటి కోసం గ్రామస్థులు ఐదేళ్లుగా పడుతున్న ఇబ్బందులను అప్పటి మంత్రి కేటీఆర్‌కు గ్రామ యువకులు ట్విటర్ ద్వారా తెలిపారు. అనంతరం కలెక్టర్లు, నీటి సరఫరా అధికారులకు ఎన్నో విన్నపాలు చేశారు. పది రోజుల క్రితం ప్రస్తుత కలెక్టర్ హరిచందనకు విన్నవించారు. మిషన్ భగీరథ ఎస్ఈతో పాటు పలువురు అధికారులు ఎన్నోసార్లు గ్రామానికి వచ్చి పరిశీలించారు. పైప్‌లైన్‌లు సరిగా లేకపోవడంతో తాగునీటి సరఫరా సమస్య వస్తుందని గుర్తించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన పనులు నాణ్యత లోపాలతో అక్కరకు రాకుండా పోయాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ మోహన్ గాంధీని వివరణ కోరగా గ్రామంలో తాగు నీటి సరఫరా బాగానే జరుగుతుందని, దశల వారీగా అన్ని ప్రాంతాలకు నీటిని అందిస్తున్నామని చెప్పారు.



వాటర్ ట్యాంక్, శిథిలావస్థకు చేరిన రేలింగ్, భూమి పైన నుంచి వేసిన పైప్‌లైన్

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



ఐదేళ్లుగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నాం. ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్మాణంలో నాణ్యాతా లోపాలు ఉండడంతో నీటి సరఫరా జరగలేదు. మంత్రుల దగ్గర నుంచి కలెక్టర్ వరకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాం. అధికారులు వచ్చి వెళ్తున్నారు. రెండు నెలలుగా అధికారులు ట్యాంకులకు నీటిని ఎక్కించి పైప్‌లైన్లకు వదులుతున్నా సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. సమస్య అధికారులకు అవగతమవుతున్నా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించకపోవడంతో సమస్య కొనసాగుతూనే ఉంది.

● ఇరిగి క్రాంతికుమార్, పెద్దదేవులపల్లి.

సంత్‌సేవాలాల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



దేవరకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి 22: సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గిరిజన ఆరాధ్యదైవమైన సంతు సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని దేవరకొండ బంజారభవన్‌లో గురువారం అధికారికంగా నిర్వహించారు. సేవాలాల్ జయంతి రోజున సెలవుదినంగా ప్రకటించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే బాలునాయక్ కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనతండాలు, గ్రామపంచాయతీలలో ప్రభుత్వం పాఠశాలలు ఏర్పాటు చేసి గిరిజనులకు విద్యను అందించేందుకు కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజ్‌కుమార్, దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, బంజారసంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీన్‌నాయక్, దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వడ్త్య దేవేందర్‌నాయక్, ఎంపీపీ జాన్‌యాదవ్, పార్వతి, బాలునాయక్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, పాపనాయక్, పాండునాయక్, కొర్ర రాంసింగ్, తుల్సానాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): సంత్ సేవాలాల్ అందరివాడని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంగోతు భగవాన్‌నాయక్ అన్నారు. ఈ నెల 25న నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో శ్రీ సంత్‌సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలని గురువారం మండలంలోని రంగుండ్ల గ్రామంలో సేవాలాల్ జయంతి ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్, నాయకులు రమావత్ సర్దార్‌నాయక్, రమావత్ నరేష్‌నాయక్, జటావత్ తులసీనాయక్, కోటినాయక్, రవినాయక్, భగవాన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హాలియా: ఈనెల 25వ తేదీన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో జరగనున్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షులు ఆంగోతు భగవాన్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్‌నాయక్, ప్రచార కార్యదర్శి రమావత్ రవినాయక్, మునినాయక్, దేవునాయక్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మృతురాలి బంధువుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మృతురాలి బంధువులు

కనగల్, ఫిబ్రవరి 22: కనగల్ వాగుబ్రిడ్జి సమీపంలో బుధవారం రాత్రి బైక్‌ను కారు ఢీకొని తీవ్రంగా గాయపడి మృతిచెందిన దళిత మహిళ యాదమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి బంధువులు, ప్రజాసంఘాల నాయకులు గురువారం కనగల్ ఎక్స్‌రోడ్డులో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదమ్మ నిరుపేదరాలని ఆమె కుటుంబానికి. రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి, నల్లగొండ టూటౌన్ సీఐ కొండల్‌రెడ్డి, కనగల్ ఎస్ఐ రామక్రిష్ణగౌడ్ ఆందోళకారులతో మాట్లాడారు. రాస్తారోకోను విరమించాలని సూచించారు. రాత్రి ఏడు గంటలకు మృతురాలి కుటుంబానికి రూ.20లక్షల నష్టపరిహారం ఇచ్చేందుకు పెద్ద మనుషులతో ఒప్పందం జరగడంతో వారు రాస్తారోకో విరమించారు. చాలా సేపు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రొయ్య వెంకన్న, వంపు ప్రేమయ్య, రాయలరవి, గిరి, ముచ్చపోతుల నర్సింహ్మ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలి

కనగల్, ఫిబ్రవరి 22: ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత పాటించాలని ఓపెన్ ఫోరం ప్రిసైడింగ్ అధికారి నాగిరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కరీంపాష అధ్యక్షతన ఉపాధి హామీ పనులపై గురువారం ఓపెన్‌ఫోరం నిర్వహించారు. కూలీలకు అధికవేతనాలు అందేలా పనులు కల్పించాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై ఏపీవో సుధాకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, ఏడీఐ పీడీ నవీన్ అంబుడ్స్‌మెంట్ గౌరీ, ఉపేందర్‌రెడ్డి, ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి గౌతమి ఏపీవో సుధాకర్, అజయ్, ముత్తయ్య ఈసీ ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి22: ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు హెచ్చరించారు. విద్యుత్ అధికారి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేశారు. బుధవారం సాయంత్రం సమయంలో అంగడిపేట ఎక్స్‌రోడ్డులో గల 33/11 సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న లైన్‌మెన్ శేఖర్‌కు దుబ్బతండా వద్ద విద్యుత్ స్తంభంపై మంటలు వస్తున్నాయని సమాచారం వచ్చింది. వెంటనే విద్యుత్‌ను నిలిపి వేసి లైన్‌మెన్ దుబ్బతండకు వెళ్లి విద్యుత్ తీగలను సరిచేస్తుండగా అదే తండాకు చెందిన రమావత్ లక్ష్మ లైన్‌మెన్‌పై అకారణంగా దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో లైన్‌మెన్ శేఖర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'స్టంట్ వేయకుండానే బిల్లు వసూలు చేశారు'

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 22: పూడుకుపోయిన వాల్వ్‌కు బదులుగా రక్తప్రసరణ సరిగా ఉన్న మూడు వాల్వ్‌లకు స్టంట్‌లు వేసి తననుంచి 3.40లక్షల బిల్లు వసూలు చేశారని బాధితుడు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశాడు. మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామానికి చెందిన మిట్టగడుపుల ప్రవీణ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. వ్యవసాయం చేస్తూ జీవనంసాగించే ప్రవీణ్‌కుమార్ గత ఏడాది మే నెలలో ఒళ్లు నొప్పులతో బాధపడుతూ మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. ఆర్‌ఎంపీ బంటు మీనయ్య సూచన మేరకు రివర్ ఆస్పత్రికి వెళ్లగా, వాల్వ్ పూడుకుపోయాయని స్టంట్ వేయాలని వైద్యులు సూచించారు. మొత్తం నాలుగు వాల్వ్‌లకు స్టంట్ వేసినందుకు, ఇతర ఖర్చులకు రూ.3.40లక్షల బిల్లు వసూలు చేశారని తెలిపారు. కొన్ని నెలల అనంతరం నొప్పులతో ఇబ్బందులు పడుతూ హైదరాబాద్, ఖమ్మంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు చేయించగా, సక్రమంగా ఉన్న మూడు వాల్వ్‌కు స్టంట్స్ వేసి, పూడుకుపోయిన వాల్వ్‌కు స్టంట్ వేయలేదని నివేదిక వచ్చిందన్నారు. రివర్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపాడు.

ఈ విషయమై రివర్ ఆస్పత్రి ప్రతినిధి సైదిరెడ్డి మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు అవాస్తవమని, తమవద్ద అన్నీ ఆధారాలున్నాయన్నారు. బలహీనంగా ఉండటంతో రెండు వాల్వ్‌లకు మాత్రమే స్టంట్ వేశామని తెలిపారు.

హాలియా: హాలియా మునిసిపాలిటీ పరిధిలోని వ్యాపారులందరూ 2023-24 సంవత్సరానికి దుకాణాల ట్రేడ్ లైసెన్స్ ఫీజు రెన్యువల్ చేయించుకోవాలని హాలియా మునిసిపల్ కమిషనర్ మహ్మద్ మున్వర్‌అలీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ ఫీజు రెన్యువల్ చేయించని పక్షంలో ట్రేడ్ లైసెన్సులపై పెనాల్టీలు పడుతాయన్నారు. అదే విధంగా లైసెన్స్ తీసుకొని వారు కూడా ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించి లైసెన్స్ తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

దేవరకొండ: దేవరకొండ మండలం మైనంపల్లి ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్ మూడు సంవత్సరాలుగా ఆడబిడ్డ కల్యాణానికి రూ.2016 అందజేస్తున్నారు. రామన్న కళ్యాణకానుక పేరుతో బుధవారం మైనంపల్లి గ్రామానికి చెందిన యువతి వివాహానికి హాజరై కల్యాణ కానుకగా రూ.2016 అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వెంకట్, నాయకులు చందు, గౌతమి, సీతరాం తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: రైతులు తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సైదానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ఈకేవైసీ చేయించుకోవాలని లేనిపక్షంలో పీఎంకిసాన్ యోజన పథకం వర్తించదని, తద్వారా రైతులు నష్టపోతారని అన్నారు. రైతులు ఇప్పటివరకు తమ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులు ఏఈవోలను సంప్రదించాలన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: ఉమ్మడి మండలం కోదండపురం గ్రామంలోని పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయలను విక్రయించేందుకు దేవాలయ పాలక మండలి ఆధ్వర్యంలో గురువారం వేలం నిర్వహించారు. రూ.1.10లక్షలకు అదే గ్రామానికి చెందిన వ్యాపారి బొడ్డుపల్లి శ్రీనివాస్ దక్కించుకున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, పాలక మండలి సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణాచారి, పోచంరెడ్డి సైదిరెడ్డి, పోలే ఇందిరామహేందర్, నక్క బిక్షమయ్య, ఇంద్రకంటి లక్ష్మయ్య, బాలబోయిన వెంకటయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఒంటెద్దు అంజిరెడ్డి, గజ్జెల లక్ష్మీనారాయణరెడ్డి, సత్యనారాయన, పోచంరెడ్డి సంతోష్‌రెడ్డి, గజ్జెల వెంకట్‌రెడ్డి, పోచంరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

త్రిపురారం: మండలంలోని మాటూరు, త్రిపురారం, పెద్దదేవులపల్లి, నీలాయిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రవీందర్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడ 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి బి.అన్నారం సబ్‌స్టేషన్ వరకు ఆరు కిలోమీటర్లు 33 కేవీ లైన్ వినియోగంలోకి తెచ్చేందుకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నల్లగొండ కల్చరల్: పట్టణంలోని మిర్యాలగూడ ఆనంద్‌నగర్‌లోని శ్రీభూనీళా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు కారంపూడి వెంకటరఘునందనాచార్య ఆధ్వర్యంలో రుత్విక్‌లు వేద మంత్రోచ్చరణతో విష్వక్సేనపూజ, వాసుదేవ పుణ్యావాచనం, అగ్నిప్రతిష్ట, బలిహరణం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారం గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదా వాసుదేవ్, యాదగిరిరెడ్డి, పిచ్చయ్య, సూర్యనారాయణ, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ: పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించడానికి గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని నాలుగు థియేటర్లలో టువెల్త్ ఫెయిల్ సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. మనోజ్ కుమార్‌శర్మ ఐపీఎస్ అధికారి రియల్ స్టోరీతో రూపొందించిన ఈ సినిమాలను ఎస్‌జీ కళాశాలకు చెందిన 2500 మంది విద్యార్థులు తిలకించారు. విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి కూడా సినిమాను తిలకించారు.

హజ్రత్ అబ్బాస్ దర్గా ఉర్సు ప్రారంభం



పీకేమల్లేపల్లి గ్రామంలో ఒంటెపై గంధం ఊరేగిస్తున్న భక్తులు

చింతపల్లి, ఫిబ్రవరి 22: మండలంలోని పీకేమల్లేపల్లి గ్రామంలో హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉర్సు ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. దర్గా ముతవల్లి ఎండి. చాంద్‌పాష ఒంటెపై గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు రంగారెడ్డి, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం, గుంటూరు, నెల్లూరు తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వచ్చిన భక్తులకు గురువారం దర్గా వద్ద అన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా శ్యామ్యానాలు ఏర్పాటు చేయడంతోపాటు మంచినీటి సౌకర్యం కూడ కల్పించారు. ఎస్ఐ బి.యాదయ్య, సీఐ జలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 100 మంది పోలీస్‌సిబ్బందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్గా వద్ద వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా చైర్మన్ కేవీ. రమేష్‌రాజ్, ఎండి. సయ్యద్‌పాష, ఎండి. యూసుఫ్ పాష, ఎండి. సులేమాన్, సీహెచ్ కృష్ణ, ఎండి. జానిమియా, కృష్ణ అబ్బయ్య, షేక్‌వలీ, వెంకటేష్, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. హజ్రత్ అబ్బాస్ దర్గాను గురువారం మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సందర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్రనేత కంకణాల వెంకట్‌రెడ్డి, పల్లా ప్రవీన్‌రెడ్డి, అండేకార్ అశోక్, నట్వ గిరిధర్, గోపిడి కిస్టారెడ్డి, కొప్పుల రాములు గౌడ్, బాజేపల్లి నిరంజన్‌గౌడ్, ఉజ్జిని నరేందర్‌రావు తదితరులు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ కవలల దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న సుష్మిత, మహిత

చింతపల్లి, ఫిబ్రవరి 22: అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీ వీటీనగర్‌కు చెందిన సందెపట్ల మల్లయ్య జంగమ్మ దంపతులకు కవలలు పుట్టగా రామ లక్ష్మణ్‌గా పేరు పెట్టారు. రామ్ ఎంటెక్, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి హైకోర్టులో లాయర్‌గా హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. లక్ష్మణ్‌సాగర్ ఫొటోగ్రఫీ వృత్తిలో ఉన్నాడు. చింతపల్లికి చెందిన ఇటికాల లక్ష్మణ్ మంజుల వాణి దంపతులకు సుష్మిత, మహిత కవలలు ఉన్నారు. సుష్మిత ఎంఎస్‌సీఎస్ చదువుతుండగా, మహిత ఇంటర్ పూర్తిచేసి నీట్‌లో శిక్షణ తీసుకుంటుంది.

నల్లగొండ: జిల్లాకేంద్రం యాట కన్నారెడ్డి కాలనీలోని న్యూస్ పాఠశాలలో అంతర్జాతీయ కవలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి కేక్ కట్ చేసి కవలల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మిస్ట్రెస్ గంట్ల పద్మ, ప్రిన్సిపాల్ అలుగుబెల్లి తిరుమల్ రెడ్డి, స్పందన, పర్వతరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, లక్ష్మణ్, ఫాతిమా పాల్గొన్నారు.


యువత వింతపోకడలు మానుకోవాలి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 22: యువత వింతపోకడలతో సమాజంపై ప్రభావం చూపుత అభాసుపాలు కాకూడదని కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి అన్నారు. గురువారం కొండమల్లేపల్లిలో ట్రాఫిక్ నియంత్రించే క్రమంలో ఇద్దరు యువకులు విచిత్రమైన హెయిర్ స్టైల్‌తో కన్పించారు. సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించి, స్థానిక హెయిల్ సెలూన్‌కు తీసుకెళ్లి కటింగ్ చేయించారు.

భక్తి భావం అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 22: భక్తి భావం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని శ్రీమహిషాసురమర్ధిని అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలోని పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అర్చకులు వెల్లటూరి జగన్మోహన్‌శర్మ, వెల్లటూరి రామ్మోహన్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి గణపతి పూజ, శాంతికుంభాభిషేకం, రుద్ర హోమం, దుర్గాసూక్త, శ్రీసూక్తహోమం, నవగ్రహ హోమం, మహాపూర్ణాహుతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పొదిల శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, బాలు ఉన్నారు.

దామరచర్ల: మండలంలోని వాడపల్లి కృష్ణానది తీరంలో గల శ్రీమీనాక్షి అగస్తేశ్వరస్వామిని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు.



కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ తొలి వార్షికోత్సవం సందర్భంగా గురువారం దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం చెన్నారం గ్రామంలో చెన్నకేశవస్వామి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ దీప్‌లాల్, రమావత్ తులసిరాం, నేనావత్ భద్రు, రమేశ్, బొడ్డుపల్లి కృష్ణ, జవహర్‌లాల్, ఆలయ వ్యవస్థాపకులు సాల్వది ధనిష్టసుశీల తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: రేషన్‌కార్డులకు ఆధార్ అనుసంధానం కోసం రేషన్ డీలర్లు కేవైసీ చేయించాలని తహసీల్దార్ బక్క శ్రీనివాస్ అన్నారు. మండలంలో కేవలం 80శాతం మాత్రమే కేవైసీ పూర్తి అయిందని, 20శాతం పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వ చౌకధరల దుకాణాల డీలర్లు ఈనెల 29వరకు 100శాతం పూర్తి చేయాలని వారు సూచించారు. కేవైసీని పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే డీలర్లకు చర్యలు తప్పవని ఆయన అన్నారు.

డిండి: రేషన్‌కార్డుదారులు ఈనెల 29వరకు రేషన్ దుకాణాలలో తమ డీలర్ల వద్ద కుటుంబ సభ్యుల వివరాలను ఈకేవైసీ చేయించుకోవాలని డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరబోయినపల్లి, సింగరాజుపల్లి గ్రామంలో సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఇతర గ్రామాల డీలర్లను నియమించి ఈకేవైసీ వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీరబోయినపల్లిలో ఆరుగురు డీలర్లు, సింగరాజుపల్లిలో నలుగురు డీలర్లు ఈకేవైసీ చేస్తున్నట్లు చెప్పారు.